శాంతిభద్రతలను పరిరక్షించాలి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్
- గూడూరు పోలీస్ స్టేషన్ తనిఖీ

పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

గూడూరు, నవంబర్ 8: శాంతి భద్రతలను పరిరక్షించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది హాజరు, వాహనాలను పరిశీలించారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ లో వివిధ కేసుల ఫైళ్లు, రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, పరిష్కారమైన కేసుల గురించి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో క్రికెట్ నెట్ ప్రాక్టీస్, వాలీబాల్, షటిల్ కోర్టులను ప్రారంభించారు. సీఐ బాబురావు, ఎస్సైలు, పోలీస్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పోలీసులు శాఖ ఇమేజ్ పెంచేలా పనిచేయాలని, సైబర్‌నేరాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, మత్తుపదార్థాలు, గంజాయి వంటి వాటికి యువత అలవాటుపడకుండా చూడాలని తెలిపారు. సిబ్బంది యోగక్షేమాలు తెలుసుకుని, క్రీడా ప్రాంగణాలను ఉపయోగించుకుని ఫిట్‌నెస్‌గా ఉండాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించి పరిష్కారానికి జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ఎస్సైలు గిరిధర్‌రెడ్డి, కుశకుమార్, రవి పాల్గొన్నారు.

స్టెనో టైపిస్ట్ ఉద్యోగాలకు దరఖాస్తులు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 8 : జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో స్టెనో టైపిస్టులు, రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోర్ట్ సూపరింటెండెంట్ క్రాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు డిగ్రీ, షార్ట్ హ్యాండ్ హయ్యర్ అర్హత గల వారు దరఖాస్తులను ఈనెల 23 వరకు అప్లై చేసుకోవాలని, డిసెంబర్ 14న నియామక పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మరింత వివరాల కోసం జిల్లా కోర్టులో సంప్రదించాలని తెలిపారు.

శబరిమలకు స్పెషల్ బస్సులు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 8 : జిల్లా కేంద్రం నుంచి శబరిమలకు వెళ్లే అయ్యప్ప స్వాములకు ప్రత్యేక బస్సుల సౌకర్యం ఉందని ఆర్టీసీ డిపో మేనేజర్ శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం డిపోలోని 9959226054 నంబరుకు సంప్రదించాలని కోరారు.

గంగారం ఎంఈవోగా రమాదేవి

బాధ్యతలు స్వీకరిస్తున్న రమాదేవి

గంగారం, నవంబర్ 8: మండల విద్యా శాఖ అధికారిగా రమాదేవి శనివారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. ఉపాధ్యాయులు శాలువాతో కప్పి సన్మానించారు. కొత్తగూడ ఎంఈవో గుమ్మడి లక్ష్మినారాయణ, గంగారం ఆశ్రమ పాఠశాల హెఎం కల్తి కాంతారావు, సీఆర్‌పీలు గిరిబాబు, రవీందర్ పాల్గొన్నారు.

ఇన్సెంటీవ్ ఇప్పించాలి

కేసముద్రం, నవంబర్ 8: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పనిచేసే ఆశవర్కర్లకు పల్స్ పోలియో, హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీలకు సంబంధించిన ఇన్‌సెంటీవ్ ఇప్పించాలని మెడికల్ ఆఫీసర్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తున్న తమపై కక్ష సాధింపు తగదన్నారు. కార్యక్రమంలో మల్లేశ్వరీ, దేవేంద్ర, పుష్ప, అలీమ, స్పందన, సువర్ణ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED HELPERS
jobs Apply Now!
★హైదరాబాద్ నందు 5 స్టార్ హోటల్‌లో పని చేయుటకు
''హెల్పర్లు'' కావలెను. 12 గంటల డ్యూటీ, 18,000/- జీతం, రూమ్+ఫుడ్ ఫ్రీ. వయస్సు: 18-30 సం॥లు.
No Consultency, Direct Job. Contact: 9885283513.
NT-335863_All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

పాలకుర్తి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

ఎమ్మెల్యేకు మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ సవాల్

శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ

తొర్రూరు, నవంబర్ 8: పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుదేనని మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్లుగా సాగునీరు, విద్య, వైద్యం తదితర సౌకర్యాలు కల్పించారని పేర్కొన్నారు. గడిచిన పదకొండు నెలల్లో చేసిన అభివృద్ధిపై ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్‌పై ఎమ్మెల్యే వద్ద ఉన్న ప్లాన్స్, బడ్జెట్ ఏమిటని ప్రశ్నించారు. ఎర్రబెల్లి పదేళ్లలో ఏం చేయలేదని పబ్లిక్ మీటింగ్స్‌లో అనడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన పేరుతో అప్రజాస్వామిక పాలన చేస్తున్నారని ఆరోపించారు. 420 హామీలను ఎంత వరకు అమలు చేశారని, అబద్దాలతో గద్దెనెక్కి ఎంతకాలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో మంజూరైన పనులకు శంకుస్థాపన చేస్తూ తానే మంజూరు చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యా

నర్సింహులపేట, నవంబర్ 8: నర్సింహులపేట మండలం పడమటిగూడెం గ్రామ పంచాయతీ పరిధి గ్యామతండాలోని శుక్రవారం హనుమాన్ దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పాల్గొని పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు వీరు నాయక్, బీఆర్ఎస్ యూత్ మండల ప్రధాన కార్యదర్శి మంచాల శ్రీశైలం, గ్రామ కార్యదర్శి లక్పతి, మాజీ ఎంపీటీసీ స్వామి నాయక్, భద్రునాయక్, అలవాల యాకన్న, చిదిమిల్ల యుగంధర్, హెచ్ సైదులు, శ్రీను, చంద్రబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ వారికి వర్తించవా?

కార్లు నడిరోడ్డుపై నిలిపి సీఎం బర్త్ డే వేడుకలు

కాంగ్రెస్ పార్టీ నాయకులు రోడ్డుపైనే నిలిచిన కార్లు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 8 : పట్టణంలో నడిరోడ్డుపై వాహనాలు నిలిపి అధికార పార్టీ నాయకులు సీఎం బర్త్ డే వేడుకల్లో పాల్గొన్నారు. ఇది చూసిన స్థానికులు ట్రాఫిక్ రూల్స్ వారికి వర్తించవా? అని చర్చించుకున్నారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూసెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలకు ఫ్లెక్సీ తీసుకుని వచ్చారు. ఈ క్రమంలో కొంత సేపటికి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ బైక్‌లను రోడ్డుపై పెట్టి ఫ్లెక్సీ కట్టారు. ఎమ్మెల్యే మురళీనాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రరెడ్డి వెహికల్స్ సైతం రోడ్డుపైనే పెట్టి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు. అవతలి బజారు నుంచి రావటానికి ఇదే ప్రధాన రహదారి కావటంతో వాహనాలు రోడ్డుపై అడ్డుగా ఉండటంతో ద్విచక్రవాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. స్థానిక టౌన్, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోలేదు. సామాన్యులైతే ఇబ్బందులకు గురిచేసే పోలీసులు అధికార పార్టీ నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు చర్చించుకుంటున్నారు.

దేవుళ్ల ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలి

విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

తొర్రూరు, నవంబర్ 8: దేవుళ్ల ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్లికట్టలో గణపతి సుబ్రహ్మణ్య, నవగ్రహ, నాగరాజ, మహాశిల, ధ్వజస్తంభ సహిత శివాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవుళ్ల ఆశీస్సులతో పాడి పంటలు సమృద్ధిగా పండి నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలని కాంక్షించారు. కాగా, కార్తీక పౌర్ణమి రోజున అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలోని శ్రీ రామ సత్యనారాయణ స్వామి ఆలయంలో ఉసిరి చెట్టు వద్ద సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత పూజలకు రావాలని ఆలయ కమిటీ ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరంజన్‌రెడ్డి, హమ్యానాయక్, రవీంద్రచారి, వెంకటనారాయణగౌడ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్డీవో గణేశ్

పెద్దవంగర, నవంబర్ 8: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వేగంగా కాంటాలు చేసి మిల్లులకు తరలించాలని తొర్రూరు ఆర్డీవో గణేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. కేంద్రానికి గన్నీ సంచులు, ప్యాడీ క్లీనర్లు, మౌలిక వసతులు ఉన్నాయా? అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. తహసీల్దార్ మహేందర్, ఆర్ఐ లష్కర్ ఉన్నారు.

బెల్లం, పటిక పట్టివేత.. ముగ్గురిపై కేసు

మరిపెడ, నవంబర్ 8: మండలంలోని ఎల్లంపేట శివారు స్టేజితండా వద్ద పోలీస్ శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. వరంగల్ –మరిపెడ రహదారిపై అనుమానాస్పదంగా వస్తున్న టవేరా వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా ఏడు క్వింటాల నల్ల బెల్లం, 50కేజీల పటిక లభ్యమైనట్లు ఎస్సై సతీష్‌గౌడ్ తెలిపారు. నిందితులు స్టేజితండాకు చెందిన చందూలాల్, ఉగ్గంపల్లికి చెందిన నరేష్, నీకుర్తికి చెందిన సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య

నెల్లికుదురు, నవంబర్ 8: మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. ఎస్సై చిర్ర రమేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మునిగెల వీడుకు చెందిన దేశబోయిన శ్రీశైలం(42) అదే గ్రామానికి చెందిన వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమె భర్త, అతడి కుటుంబ సభ్యులు గురువారం శ్రీశైలం ఇంటికి వచ్చి గొడవపడి చెప్పులతో కొట్టి అవమానించారు. దీంతో మనస్తాపం చెంది శ్రీశైలం రాత్రివేళ గ్రామ శివారు పొలం వద్దకు వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు వివాహిత భర్త, అతడి కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మహబూబాబాద్ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా జాతీయ న్యాయసేవా దినోత్సవం

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 8 : పట్టణంలో శుక్రవారం జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జడ్జీలు, న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది కోర్టు నుంచి నెహ్రూసెంటర్ వరకు ప్లకార్డ్స్‌తో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి సురేష్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను ఉపయోగించుకుని రాజీమార్గంలో తమ కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచితంగా న్యాయవాదులను నియమించి న్యాయసాయం అందించనున్నట్లు తెలిపారు. జైల్‌లో మగ్గుతున్న అనేక మంది ఖైదీలకు సైతం ఉచిత న్యాయవాదుల ద్వారా విడిపించనున్నట్లు చెప్పారు. జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, ప్రభుత్వ న్యాయవాది వెంకటస్వామి, సీనియర్ న్యాయవాది వెంకటయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

బహుమతులు అందిస్తున్న జడ్జి సరిత

తొర్రూరు, నవంబర్ 8: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మట్ట సరిత సూచించారు. న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కేజీబీవీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. బాలికలు అత్యవసర సాయం కోసం 1098కు ఫోన్ చేసి రక్షణ పొందవచ్చన్నారు. ఫోక్సో యాక్ట్, లైంగిక వేధింపులు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, విద్యా హక్కు చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యలో రాణిస్తున్న బాలికలకు జడ్జి బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా మెనూ పాటించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 8 : మెనూ తప్పనిసరిగా పాటించాలని డీఈవో రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ వంట గదులు, తరగతి గదును పరిశీలించారు. జీసీడీవో విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

పెద్దముప్పారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రనాయక్

దంతాలపల్లి, నవంబర్ 8: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మండలంలోని రామనుజపురం, పెద్దముప్పారం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, తహసీల్దార్ చంద్రరాజేశ్వర్, ఎంపీడీవో వివేక్ రాం, ఏవో వాహిని, తొర్రూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భట్టునాయక్, ఎంపీవో అప్సార్‌పాషా, ఆర్ఐ నజీమొద్దీన్, పీఏసీఎస్ సీఈవో వెంకన్న, ఏఈవో దీక్షిత్‌కుమార్, పార్టీ నాయకులు నవీన్‌రెడ్డి, శ్రీను, గురుపాల్‌రెడ్డి, బాలాజీ, లింగరెడ్డి, సతీష్, యాకన్న, హరికృష్ణ, అనిల్, యాకన్న, రైతులు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

డోర్నకల్ బైపాస్‌రోడ్డు వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

డోర్నకల్, నవంబర్ 8: డోర్నకల్ బైపాస్ రోడ్డు నుంచి పోచారం రైల్వేస్టేషన్ మధ్య విజయవాడ నుంచి బీడీసీఆర్ వైపు వెళ్తున్న ఖాళీ వ్యాగన్లు కలిగిన గూడ్స్ రైలు శుక్రవారం రాత్రి పట్టాలు తప్పింది. గూడ్స్ రైలు మూడు వ్యాగన్లు పట్టాలు తప్పడంతో గూడ్స్ రైళ్ల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. రైల్వే సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. బైపాస్ నుంచి వెళ్లే గూడ్స్ రైలు రాకపోకలు మాత్రమే నిలిచాయి. రైల్వే అధికారులు సమక్షంలో సిబ్బంది మరమ్మతు చేస్తున్నారు. విజయవాడ నుంచి బీడీసీఆర్ వైపు బోగ్గు లోడ్‌కు వెళ్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఓటరు అవగాహన ర్యాలీ

బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

నర్సింహులపేట, నవంబర్ 8: మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు అవగాహన ర్యాలీ తీశారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవో రామ్మోహన్‌రావు, ఏపీఎం వీరన్న మాట్లాడారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ యువకులు ఫారం 6 ద్వారా ఓటు హక్కు కోసం బూత్‌లెవల్ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సీసీ భీముడు, సునీత, సుశీల, వెంకట్రాములు, రాణి ఉన్నారు.

మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు తనిఖీ

చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న తొర్రూరు మార్కెట్ కమిటీ కార్యదర్శి నిరంజన్

దంతాలపల్లి, నవంబర్ 8: మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును శుక్రవారం తొర్రూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి నిరంజన్ తనిఖీ చేశారు. మూడు జిల్లాల కూడలిగా ఉన్న చెక్‌పోస్టు వద్ద మార్కెట్‌కు తరలించే ధాన్యం, పత్తి వాహనాలను పరిశీలించి రశీదులు ఇవ్వాలని అన్నారు. రైతుల నుంచి ఎలాంటి వసూళ్లకు పాల్పడినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుగులోత్ భట్టునాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

అభినందిస్తున్న హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు

తొర్రూరు, నవంబర్ 8: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్ సూచించారు. శుక్రవారం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థిని మండలంలోని గోపాలగిరికి చెందిన వి.దశమిక ఇటీవల చెస్ పోటీల్లో జిల్లా స్థాయిలో రాణించి, రాష్ట్ర స్థాయికి ఎంపికవడంతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థినికి దాతలు ఆర్థికంగా సాయం చేయాలని కోరారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు కొండ్లె ఉమేశ్, శ్రీరాం నవీన్, మాచర్ల శ్రీనివాస్, నర్కుటి రామారాజు, వీరస్వామి, మహేశ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బాలికలు మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 8 : బాలికలు మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం అన్నారు. శుక్రవారం కళాశాల విద్యార్థిని హతీయతహనీయత్ మార్షల్ ఆర్ట్స్‌లో విశేష ప్రతిభ కనబరచడంతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ బాలికలకు రక్షణగా ఉంటుందన్నారు. కళాశాల అధ్యాపకులు కుమార్, సాదిక్, రవి కిరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎంపిక చేయాలి

డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గార్ల, నవంబర్ 8: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆ పార్టీ నాయకుడు జీ.సక్రు ఆధ్వర్యంలో శుక్రవారం డీటీ జర్పుల సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పేదలకు ఆరు గ్యారెంటీలు అందించాలని, రేషన్‌కార్డు లేని నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరారు. న్యూడెమోక్రసీ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంఘం మండల కమిటీ ఎన్నిక

భారతి, అధ్యక్షురాలు — మాధవి, ఉపాధ్యక్షురాలు

బయ్యారం, నవంబర్ 8 : దివ్యాంగుల సంక్షేమ సంఘం మండల కమిటీని శుక్రవారం కొత్తపేటలో సంఘ వ్యవస్థాపకుడు మల్సూర్ సమక్షంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా హట్కార్ భారతి, ప్రధాన కార్యదర్శిగా మతంగి తిరుమలరావు, ఉపాధ్యక్షురాలిగా పోగుడు మాధవి, కార్యదర్శిగా బొడ్డుపల్లి ఉపేందర్, కోశాధికారిగా సూర్యనారాయణ ఎన్నికయ్యారు.

సీపీఎం టౌన్ కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 8 : సీపీఎం టౌన్ కార్యదర్శిగా మండలంలోని జమాండ్లపల్లికి చెందిన అల్లి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం పత్తిపాకలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ నియమించినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరాఫరాకు అంతరాయం

కురవి,దంతాలపల్లి, నవంబర్ 8: జిల్లాలో శనివారం పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. కురవి మండలం అయ్యగారిపల్లి సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా మండల కేంద్రంలో ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శారద శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, దంతాలపల్లి, పెద్దముప్పారం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్‌హెచ్ఎం స్కీమ్ పోస్టుల మెరిట్ జాబితా సిద్ధం

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 8 : జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) పథకం కింద ఖాళీగా ఉన్న ఆరు రకాల పోస్టులకు ఈనెల 6న సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ ఆధారంగా అభ్యర్థులను డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ఎంపిక చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మురళీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. సెలక్ట్ అయిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో ఈనెల 11న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆఫీస్‌కు రావాలని సూచించారు.

చేసిన పనులకు బిల్లులు చెల్లించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 8 : మున్సిపాలిటీ పరిధిలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు చెల్లించాలని మున్సిపల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బోయినపల్లి లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు మున్సిపల్ కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆరు నెలల నుంచి చేసిన ఒక్క పనికి కూడా బిల్లులు రాలేదన్నారు. 14వ, 15వ ఫైనాన్స్ నుంచి ఎస్‌డీఎఫ్ బిల్లులు కూడా చెల్లించడం లేదని, రోజూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నామని వాపోయారు. రావుల సతీశ్‌రెడ్డి, రఘు, ఉపేందర్, రాజేశ్, సమద్ పాల్గొన్నారు.

ఇళ్ల పునర్నిర్మాణానికి ఆటంకాలు కలిగించొద్దు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 8 : నిరుపేదల ఇళ్ల పునర్నిర్మాణానికి ఆటంకాలు కలిగించొద్దని సీపీఐ మున్సిపల్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బీ అజయ్‌సారథి అన్నారు. ఎమ్మెల్యే మురళీనాయక్‌ను శుక్రవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా భూపోరాటం చేసి దక్కించుకున్న జాగలో పేదలు ఇండ్లు నిర్మించుకుంటే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కూలగొడుతున్నారని, పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు